## నీలగిరి నిత్యపద్యం

**ఆటవెలది**

రెచ్చగొట్టి మనకు చిచ్చుబెట్టు జనుల
దూరముంచుమీవు ధూర్తుడనుచు
బుసనుకొట్టునట్టి పుట్టపురుగు నిలన
కొట్టిజంపవలెను కోపముగను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి

-------------------------

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 148 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 25-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## కమ్యూనిస్టు యోధునికి కన్నీటి వీడ్కోలు

**భౌతికకాయానికి తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్, చంద్రబాబు ఘన నివాళులు**

- సురవరం సేవలను స్మరించుకున్న పలువురు నేతలు, వామపక్ష శ్రేణులు
- డిప్యూటీ సీఎం భట్టి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళి
- అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర
- గాంధీ ఆస్పత్రికి భౌతికకాయం అప్పగింత




హైదరాబాద్ ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):–

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అగ్రనేత, ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డికి పలువురు జాతీయ, రాష్ట్ర నేతలు, వామపక్ష శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. ఎర్రజెండా ముద్దుబిడ్డగా దేశానికి, ప్రజలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సురవరం ఆశయాల సాధనకు కంకణబద్ధులవుతామంటూ ప్రతినబూనారు. 'జోహార్.. జోహార్.. సురవరం, సాధిస్తాం మీ ఆశయాలను, వర్ధిల్లాల్లి ఎర్రజెండా' అంటూ వామపక్ష నేతలు ఆయనకు రెడ్ సెల్యూట్ చేశారు. శుక్రవారం రాత్రి కన్నుమూసిన సురవరం భౌతికకాయాన్ని ఆయన కుమారుడు నిఖిల్ అమెరికా నుంచి రావాల్సి ఉన్నందున ఆదివారం ఉదయం వరకు గచ్చిబౌలిలోని ఓ ఆస్పత్రి మార్చురీలో ఉంచిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం 9.30 గంటలకు అక్కడి నుంచి భౌతికకాయాన్ని హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం -మిగతా 2 లో



## వరల్డ్ ఆర్చరీలో చరిత్ర సృష్టించిన చికితా తనిపర్తి

**చరిత్ర లో భారత్‌కు తొలి సారి బంగారు పథకం**



హైదరాబాద్, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):

కెనడా వేదికగా భారత్ గర్వించదగ్గ ఘనత ఆవిష్కృతమైంది. విన్నిపెగ్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్–2025లో భారత యువతి చికితా తనిపర్తి తన ప్రతిభతో చరిత్ర సృష్టించింది. అండర్ –21 మహిళల కాంపౌండ్ విభాగంలో ఆమె బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడం భారత్ తరఫున మొట్టమొదటి సారి కావడం విశేషం. కేవలం 20 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ వేదికపై ఇంతటి గౌరవాన్ని సాధించడం దేశానికి గర్వకారణమైంది.నాకౌట్ దశల నుంచే ఆమె ఆడిన ప్రతి పోటీ శ్రద్ధను ఆకర్షించింది. చురుకైన ప్రతిస్పందన, నిశితమైన దృష్టి, గెలుపు పట్ల ఉన్న పట్టుదలతో

-మిగతా 2 లో




## తొలిసారి రుణం కోరేవాళ్లకు సిబిల్ స్కోర్ తప్పనిసరి కాదు!

- క్రెడిట్ రిపోర్టులపై రూ.100కు
- మించి వసూలు చేయరాదు
  కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

న్యూఢిల్లీ,


బ్యాంకుల నుంచి మొదటిసారి రుణాన్ని తీసుకునేవారికి 'సిబిల్ స్కోర్' తప్పనిసరి కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. క్రెడిట్ స్కోర్ తక్కువ లేదా జీరో ఉందన్న కారణంతో, బ్యాంకు రుణాన్ని తొలిసారి కోరుతున్న వారి దరఖాస్తులను తిరస్కరించరాదని కేంద్రం తెలిపింది. అయితే, దరఖాస్తుదారుల నేపథ్యాన్ని తెలుసుకునేందుకు తనిఖీలు చేయాల్సిందేనని బ్యాంకులకు సూచించింది.

-మిగతా 2 లో

## లైఫ్ సైన్సెస్ - మెడికల్ హబ్‌గా తెలంగాణ

**తయారీ రంగం ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం**

- ప్రకృతి ఉత్తమ గురువు.. నేర్చుకోవాలిగానీ తప్పుచేయొద్దు
- బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్–2025 సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):–హైదరాబాద్

లైఫ్ సైన్సెస్, మెడికల్ హబ్‌గా తెలంగాణ నిలిచిందనీ, ఇప్పుడు తయారీ రంగం ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో జరిగిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్(ఆసియా–పసిఫిక్)–2025లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బయోడిజైన్ ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణల సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మనం రూపొందించే దేనిలోనైనా ప్రయోజనం, పనితీరు, రూపం ప్రాథమిక అంశాలుగా ఉంటాయనీ, దేవుడు గొప్ప డిజైనర్..ప్రకృతి ఉత్తమ గురువు అని చెప్పారు. ప్రకృతి నుంచి నేర్చుకోవాలిగానీ తప్పులు చేయొద్దని సూచించారు. కృత్రిమ మెదడును సృష్టించడానికి సహజ మెదడును ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు.

-మిగతా 2 లో

## రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల పరిధిని తుంగలో తొక్కడమే



- 'బుల్డోజర్ న్యాయం'పై సీజేఐ గవాయ్ ఆగ్రహం
- కార్యనిర్వాహక వర్గం జడ్జిగా వ్యవహరిస్తే.. కోర్టుల జోక్యం తప్పనిసరి!
- చట్టపర ప్రక్రియ పాటించకుండా ఇండ్ల కూల్చివేత తగదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 24

దేశంలో కొన్ని రాష్ట్రాల్లో అమలవుతున్న 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నిశితంగా విమర్శించారు. ఇది రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల పరిధిని తుంగలోకి తొక్కడమేనని అన్నారు. న్యాయ పాలనాధికారాన్ని కూడా తానే నిర్వహిస్తూ కార్యనిర్వహక వ్యవస్థ వ్యవహరిస్తున్నందున న్యాయస్థానం జోక్యం తప్పనిసరైందని పేర్కొన్నారు. నేరాలకు పాల్పడిన వారి ఇళ్లను ఏకపక్షంగా బుల్డోజ్ చేసిన అనేక జిల్లా పరిపాలనా చర్యలు చట్టపాలన, రాజ్యాంగబద్ధమైన అధికారాల విభజన భావం మూలాన్ని దెబ్బతీశాయని ఆయన అన్నారు. గోవా హైకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ కార్యనిర్వాహక వర్గం తనకు తానుగా -మిగతా 2 లో

## రష్యా అణు విద్యుత్తు కేంద్రంపై ఉక్రెయిన్ దాడి

- ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్, భారీయెత్తున మంటలు

కీవ్



ఒక వైపు 34వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న ఉక్రెయిన్ మరో వైపు రష్యాలోని పశ్చిమ కుర్స్క్ ప్రాంతంలోని అణు విద్యుత్తు కేంద్రంపై డ్రోన్లతో దాడి చేసింది. ఈ విషయాన్ని రష్యా అధికారులు నిర్ధారించారు. ఉక్రెయిన్ ప్రయోగించిన 95 డ్రోన్లను తమ రక్షణ వ్యవస్థలు సమర్థంగా అడ్డుకుని ధ్వంసం చేశాయని చెప్పారు.తమ పవర్, ఎనర్జీ -మిగతా 2 లో

## వచ్చేది బై ఎలక్షన్ కాదు. కాంగ్రెస్‌కు బైబై ఎలక్షన్



**దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికల్లో గెలవాలి**

- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కేటీఆర్ సవాల్
- 20 నెలల్లో రేవంత్‌రెడ్డి చేసిందేమిటో ప్రజలకు చెప్పి ఉప ఎన్నికలకు వెళ్లాలి
- పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో సుప్రీంకోర్టు తీర్పుతో ఓటమి భయం పట్టుకున్నది
- కాంగ్రెస్ నేతల వసూళ్లకే హైడ్రా: కేటీఆర్

హైదరాబాద్ ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, దమ్ముంటే ఉపఎన్నికల్లో పోటీ చేసి తిరిగి గెలవాలని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన 20 నెలల పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్‌చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఓటమి భయం పట్టుకున్నదని వ్యాఖ్యానించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన శేరిలింగంపల్లి -మిగతా 2 లో



## బీసీ బిల్లు ఆమోదించండి

- అమిత్‌షాకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విజ్ఞప్తి
- పరిశీలిస్తాం : అమిత్‌షా

హైదరాబాద్

ఢిల్లీలో జరుగుతున్న స్పీకర్ల సదస్సులో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ప్రారంభోపన్యాసం తర్వాత తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్..కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లు అంశాన్ని ప్రస్తావించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉందని స్పీకర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రత్యేకంగా మిమ్ముల్ని కలిశారని గుర్తు చేశారు. -మిగతా 2 లో



## అమెరికా చదువులపై అనిశ్చితి!

- జూలైలో సగానికి తగ్గిన భారత విద్యార్థులు
- ట్రంప్ సర్కారు విధానాలే కారణం

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల వల్ల స్టూడెంట్ వీసాలపై అమెరికాకు వెళ్లేవారి సంఖ్య జూలైలో దారుణంగా తగ్గిపోయింది. జూలైలో కేవలం సుమారు 79,000 మంది మాత్రమే అమెరికాకు వెళ్లారు. 2025లో నెలవారీ గణాంకాలను పరిశీలించినపుడు జూలైలోనే అత్యధికంగా 28 శాతం తగ్గుదల కనిపించింది. భారత్ నుంచి వెళ్లే విద్యార్థులు 46 శాతం మేరకు తగ్గిపోగా, చైనా నుంచి వెళ్లేవారు 26 శాతం వరకు తగ్గిపోయారు. నిరుటితో పోల్చుకున్నపుడు వరుసగా నాలుగో నెలలో ఈ తగ్గుదల నమోదైంది. యూఎస్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేషన్ డాటాను విశ్లేషించిన బ్లూమ్‌బెర్గ్ -మిగతా 2 లో

## తొలిసారి రుణం కోరేవాళ్లకు సిబిల్ స్కోర్ తప్పనిసరి కాదు!

(మొదటి తరువాయి)

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి సభలో ఈ మేరకు సమాధానమిచ్చారు.క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు ఒక వ్యక్తికి సంబంధించిన క్రెడిట్ రిపోర్టులను అందించడానికి రూ.100 వరకు వసూలు చేయవచ్చునని, ఇంతకు మించి వసూలు చేయటం ఆమోదనీయం కాదని పంకజ్ చౌదరీ సభకు తెలియజేశారు. రుణాల మంజూరులో కనీస సిబిల్ స్కోర్ అంటూ ఆర్బీఐ నిర్దేశించలేదని కేంద్రం తెలిపింది. కేవలం రుణ చరిత్ర లేదన్న సాకుతో మొదటిసారి బ్యాంకు రుణాన్ని కోరుతున్న దరఖాస్తులను తిరస్కరించరాదని రుణ సంస్థలకు తెలియజేశామని, ఆర్బీఐ ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీచేసినట్టు తెలిపారు.

## రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల పరిధిని తుంగలో తొక్కడమే

(మొదటి తరువాయి)

న్యాయమూర్తి అధికారాలతో వ్యవహరిస్తున్నందున కోర్టు జోక్యం చేసుకోవడం బాధ్యత అని అన్నారు. మన రాజ్యాంగం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, చట్టసభల అధికారాలను వేర్వేరుగా నిర్వచించిందని, అలాంటప్పుడు కార్యనిర్వాహక వర్గం స్వయంగా న్యాయమూర్తిగా ఉండటానికి అధికారం ఉంటే, అప్పుడు మనం అధికారాల విభజన అనే భావననే దెబ్బతీసినట్టవుతుందని గవాయ్ అన్నారు. కేవలం కొన్ని ఆరోపణలే ఉన్న, విచారణ జరగని కొందరి వ్యక్తుల ఇళ్లను కూల్చివేయడం న్యాయ వ్యవస్థకు ఆందోళన కలిగించిందన్నారు. ‘చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా కొందరు ఇళ్లను కూల్చివేస్తున్నారు.ఆ ఇంటిలో కేవలం నిందితులు మాత్రమే ఉండరు. ఇంట్లో నివసించే కుటుంబ సభ్యులు కూడా ఉంటున్నారు. ఈ చర్యతో వారి తప్పు లేకుండానే బాధలు అనుభవించాల్సి వస్తున్నది. ఒక వ్యక్తిని దోషిగా నిర్ధారించినప్పటికీ అతనికి న్యాయపరమైన హక్కులు లభిస్తాయి. మన దేశంలో న్యాయపరమైన హక్కులు అత్యంత ముఖ్యమైనవి’ అని గవాయ్ పేర్కొన్నారు. కాగా, యూపీలోని బుల్డోజర్ చర్యలను నిలిపివేస్తూ బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం 2024 నవంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది. అధికారులు న్యాయ నిర్ణేతలు కాకూడదు అంటూ పేర్కొం ది. కార్యనిర్వాహక విభాగం న్యాయమూర్తిగా వ్యవహరించ లేదని, న్యాయ వ్యవస్థను అధిగమించ లేదని నొక్కి చెప్పింది. చట్టపరమైన ప్రక్రియ నిందితుడి నేరాన్ని ముందస్తుగా నిర్ధారించకూడదని ఆ కేసులో స్పష్టం చేసింది.

**ముంబైలోని సంపన్నుడు.. గ్రామంలోని మేస్త్రి సమానమా?**

షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై తాను తీర్పును ఇవ్వడానికి గల కారణాలను గవాయ్ గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ తీర్పుపై తన సొంత సమాజానికి చెందిన వ్యక్తుల నుంచి తీవ్రంగా విమర్శలు వచ్చాయన్నారు. తన తీర్పును ప్రజల డిమాండ్లు, ప్రజల కోరికల ప్రకారం కాకుండా తాను అర్థం చేసుకున్న చట్టం, తన మనస్సాక్షి ప్రకారం రాయాలన్న విషయం ఎప్పుడూ నమ్ముతానని ఆయన అన్నారు.

## రష్యా అణు విద్యుత్తు కేంద్రంపై ఉక్రెయిన్ దాడి

(మొదటి తరువాయి)

ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్లు శనివారం రాత్రి దాడి చేశాయని తెలిపారు. ఈ దాడిలో న్యూక్లియర్ ప్లాంట్‌లో భారీగా మంటలంటుకున్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని తెలిసింది. ఈ దాడి వల్ల ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం అయినా, రేడియో ధార్మికత స్థాయి సాధారణ స్థాయిలోనే ఉందని అధికారులు తెలిపారు.

## అమెరికా చదువులపై అనిశ్చితి!

(మొదటి తరువాయి)

ఈ వివరాలను వెల్లడించింది. 2023-24 విద్యా సంవత్సరంలో 3,32,000 మంది భారతీయ విద్యార్థులు అమెరికన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఎన్‌రోల్ అయ్యారు. ఆ ఏడాదిలో విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే. ఆ తర్వాతి స్థానంలో 2,77,000 మందితో చైనా విద్యార్థులు ఉన్నారు. ఆ సంవత్సరంలో రికార్డు స్థాయిలో 11 లక్షల మంది విదేశీ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. మొదటిసారి అమెరికాకు వెళ్లే విదేశీ విద్యార్థులు 30 శాతం మేరకు తగ్గుతారని ఆ దేశంలోని విద్యా సంస్థలు అంచనా వేశాయి. ఫలితంగా 2.6 బిలియన్ డాలర్ల మేరకు ట్యూషన్ రెవిన్యూ నష్టం వస్తుందని అంచనా వేశాయి. మరో అంచనా ప్రకారం, ఈ ఏడాదిలో 1,50,000 మంది విద్యార్థులు తగ్గుతారని, ఫలితంగా ఆగస్టు చివరి-సెప్టెంబరు ప్రారంభంలో సెమిస్టర్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్టర్‌కు 7 బిలియన్ డాలర్ల నష్టం వస్తుందని, అమెరికాలోని వివిధ నగరాల్లో 60,000కుపైగా ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని తెలుస్తున్నది.

**బిగ్ బ్యూటిఫుల్ కాదు, బిగ్ అగ్లీ చట్టం!**

ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్ వల్ల అనేక మార్పులు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలకు నిధుల కోత, ఉద్యోగులపై వేటు వంటి వాటితోపాటు భారతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. తాజాగా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ 6,000కుపైగా స్టూడెంట్ వీసాలను రద్దు చేసింది. వీసా స్క్రూటినీ కఠినతరం అయింది. వీటిలో సుమారు 4,000 వీసాల రద్దుకు కారణం క్రిమినల్ ఉల్లంఘనలని, ఉగ్రవాదానికి మద్దతిచ్చినందుకు 200-300 వరకు రద్దయ్యాయని తెలిపింది. మరోవైపు యూఎస్ ఇమిగ్రేషన్ అధికారులు వీసా దరఖాస్తుదారుల సామాజిక మాధ్యమాల ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా కానీ, యాంటీసెమెటిక్ కంటెంట్ కానీ ఉన్నాయేమో చూస్తున్నారు.

## వరల్డ్ ఆర్చరీలో చరిత్ర సృష్టించిన చికితా తనిపర్తి

(మొదటి తరువాయి)

ప్రత్యర్థులను ఒక్కొక్కరిని ఓడించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో సహచరురాలు, 2023 ఆసియా ఛాంపియన్ పర్ణీత్ కౌర్ను ఓడించగా, సెమీ ఫైనల్‌లో స్పెయిన్‌కు చెందిన పౌలా డియాజ్ మోరిల్లాస్‌ను తేలికగా మట్టికరిపించింది. చివరి పోరులో దక్షిణ కొరియా ప్రతిభావంతురాలు పార్క్ యెరిన్‌ను ఎదుర్కొన్న చికితా ఆత్మవిశ్వాసంతో బాణం విసరగా విజయమే ఆమెకు చేరువైంది. 142-136 తేడాతో సాధించిన ఈ విజయంతో బంగారు పతకాన్ని మెడలో వేసుకుని భారత జెండాను ఎగురవేసింది. ఈ విజయంతో భారత్ ఆర్చరీ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం రాసినట్లయింది. ప్రపంచ వేదికపై చికితా పేరు ప్రతిధ్వనిస్తుండగా, దేశమంతా గర్వంతో నిండిపోయింది. చిన్న వయసులోనే క్రమశిక్షణ, పట్టుదల, అచంచలమైన కృషితో సాధించిన ఈ విజయం భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలకు నాంది పలకనుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. భారత త్రివర్ణ పతకాన్ని కెనడా ఆకాశంలో ఎగురవేసిన ఈ విజయ ఘడియ చికితా తనిపర్తి ప్రతిభకు ప్రతీక, భారత్‌కు గర్వకారణం.

# కమ్యూనిస్టు యోధునికి కన్నీటి వీడ్కోలు

(మొదటి తరువాయి)

మఖ్దూం భవన్‌కు తరలించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నేత కె.నారాయణ, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, టి.జ్యోతి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు సురవరం భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో తమకు రాజకీయంగా, వ్యక్తిగతంగా ఉన్న బంధాన్ని, అనుబంధాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మఖ్దూం భవన్ నుంచి ఎర్రదండు కవాతు ముందు భాగాన నిలవగా సురవరం అంతిమయాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి వరకు రెడ్‌షర్టు వాలంటీర్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ నేతల సమక్షంలో సురవరం కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు.

**సురవరం సేవలు గుర్తుండేలా సర్కార్ నిర్ణయం : సీఎం రేవంత్ రెడ్డి**

సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చరిత్రలో నిలిచిపోయేలా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సుధాకరరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం మరిచి పోదని స్పష్టం చేశారు. ఈ నేల కోసం తమ జీవితాలను త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును హార్టికల్చర్ యూనివర్సిటీకి, జైపాల్ రెడ్డి పేరును పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి, సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టామని గుర్తు చేశారు. అలాగే సురవరం సుధాకర్ రెడ్డి పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా మంత్రి వర్గంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు. పేదలు, బహుజనుల కోసం పోరాడిన గొప్ప నేత సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. ‘విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. పాలమూరు జిల్లా బిడ్డ జాతీయ స్థాయి నేతగా ఎదగటం మనందరికీ గర్వకారణం. ఆ జిల్లాకు వన్నె తెచ్చిన గొప్పనేతల్లో ఆయన ఒకరు. అధికారం ఉన్నా లేకున్నా తన సిద్ధాంతాలను ఎప్పుడూ వీడలేదు. జీవితాంతం రాజీపడని నిరాడంబర జీవితాన్ని గడిపారు. సురవరం కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. వారి సేవలకు గుర్తుగా అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది మా పీఏసీ సమావేశంలో కూడా సురవరం సేవలను స్మరించుకున్నాం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ ద్వారా తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. సురవరం మరణం తెలంగాణకు తీరని లోటు’ అని సీఎం పేర్కొన్నారు.

**దేశానికి తీరని లోటు : ఏపీ సీఎం చంద్రబాబు**

సురవరం మరణం దేశానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సుధాకర్‌రెడ్డి దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఢిల్లీలో వివిధ ప్రభుత్వాలు ఏర్పాటు చేసినప్పుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన ఉద్యమంలో ఆయనతో కలిసి నడిచానని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం సీపీఐకి ఎంత నష్టమో.. సమాజానికి కూడా అంతే నష్టమన్నారు. ఆయన పేదల కోసం చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. గతంలో సుధాకర్‌రెడ్డితో కలిసి పోరాటాలు చేశానని అన్నారు. ‘నేనంటే ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది. ఆయన్ను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేను. వ్యక్తిగతంగా నేను చేసే పనులను ఆయన ప్రోత్సహించేవారు’ అని సురవరంతో ఉన్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# లైఫ్ సైన్సెస్ - మెడికల్ హబ్‌గా తెలంగాణ

(మొదటి తరువాయి)

తెలంగాణ రైజింగ్-2047లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ కు కేంద్రంగా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలకమైనవని తెలిపారు. ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్ , మెడ్‌టెక్ వంటివి హైదరాబాద్ లో అత్యంత కీలకమైనన్నారు. తయారీ రంగం నుంచి ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను మారుస్తున్నామని చెప్పారు. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశామనీ, అందులో పరిశోధన, పరీక్ష, తయారీ కోసం ఉత్తమ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామని వివరించారు. అక్కడ 60కి పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. స్థానిక స్టార్టప్‌లు, ఎమ్ఎస్ఎమ్ఈలు గ్లోబల్ కంపెనీలతో పాటు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఏఐజీ ఆస్పత్రి బృందాన్ని అభినందించారు. డేటా గోప్యతను పాటిస్తూనే ఇక్కడ ప్రజల వైద్యసహాయం కోసం అవసరమైన డేటాను అందజేస్తామని ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ, కార్పొరేషన్లు, విద్యా సంస్థలు, రీసెర్చ్ సెంటర్లతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయనీ, పన్నులు, యుద్ధాలు,వాణిజ్యపరమైన అడ్డంకులు వంటివి ఎదురవుతున్నాయని తెలిపారు.

# వచ్చేది బై ఎలక్షన్ కాదు.. కాంగ్రెస్‌కు బైబై ఎలక్షన్

(మొదటి తరువాయి)

నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నాయకులు మోసం చేసినా, కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకున్నారని కేటీఆర్ ప్రశంసించారుకేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేండ్లలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని కేటీఆర్ వివరించారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉండేవారని గుర్తుచేశారు. కేసీఆర్ సీఎం అయిన ఆరు నెలల్లోనే తీవ్రంగా ఉన్న విద్యుత్తు సమస్యను పూర్తిగా పరిష్కరించారని చెప్పారు. హైదరాబాద్‌ను కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా, అన్నదమ్ములుగా ఏ పంచాయితీ లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి చూపించామని వివరించారు. తెలంగాణకు గుండెకాయగా హైదరాబాద్‌ను కేసీఆర్ మార్చారని, అందుకే 2023 ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యే సీటు కూడా కాంగ్రెస్‌కు రాకుండా, మొత్తం గులాబీ జెండాకే నగర ప్రజలు ఓట్లేశారని చెప్పారు.

**20 నెలల్లో రేవంత్ చేసిందేమిటి?**

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నాయకులు ఎన్నడూ రియల్‌ఎస్టేట్‌లో వేలు పెట్టలేదని, కబ్జాలు, గూండాగిరి చేయలేదని కేటీఆర్ స్పష్టంచేశారు. కానీ, 20 నెలల్లోనే హైడ్రా పేరుతో కాంగ్రెస్ నాయకులు అరాచకం సృష్టించారని దుయ్యబట్టారు. కోర్టు ఆర్డర్ ఉన్నా పట్టించుకోకుండా పేదల ఇండ్లు కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రెండు లక్షల 85 వేల కోట్ల అప్పు చేస్తే, రేవంత్‌రెడ్డి 20 నెలల్లోనే రూ.రెండు లక్షల 20 వేల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. కేసీఆర్ ఆ అప్పుతో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అత్యాధునిక దవాఖానలు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు కట్టారని, కానీ రేవంత్ ఒక కొత్త బ్రిడ్జి కానీ, మోరీ కానీ కట్టిండా? అని ప్రశ్నించారు. కేసీఆర్ 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.70 వేల కోట్లు వేస్తే, రూ.రెండు లక్షల కోట్ల అప్పు చేసిన రేవంత్ ఏం చేశారని నిలదీశారు. రూ.200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ ప్రభుత్వం రూ.2 వేలు చేస్తే, రేవంత్ ఏం చేశారని ప్రశ్నించారు.

# బీసీ బిల్లు ఆమోదించండి

(మొదటి తరువాయి)

ఆ బిల్లు విషయం చూస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో అమిత్ షా అన్నట్టు సమాచారం

**దేశ ప్రజల సమస్యల పరిష్కారానికి నిష్పాక్షిక వేదిక కావాలి : అఖిల భారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా**

దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షికమైన వేదిక కావాలని కేంద్ర హౌం మంత్రి అమిత్ షా అన్నారు. దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కేంద్ర శాసనసభ మొదటి స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీ అసెంబ్లీలో రెండు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత స్పీకర్ల సమావేశాన్ని ఆదివారం కేంద్ర హౌం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా హౌంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ దేశ స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, స్వాతంత్ర్యం తరువాత దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడం కూడా అంతే ముఖ్యమని నొక్కి చెప్పారు. భారతీయ ఆలోచనల ఆధారంగా దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడానికి పునాది వేసే పని విఠల్‌భాయ్ పటేల్ చేశారని ఆయన అన్నారు. సభ గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయవలసిన అవసరాన్ని నొక్కిచెప్పారు. దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షికమైన వేదికను అందించాలని ఆయన అన్నారు. నిబంధనల ప్రకారం సభ సక్రమంగా జరిగేలా చూసుకోవడం ప్రతి సభ్యుని బాధ్యతని పేర్కొన్నారు. సభల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాలు నిష్పాక్షిక వాదన చేయాలని అన్నారు. ‘స్వర్ణ చరిత్రను సృష్టించిన, స్వర్ణ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న మొత్తం శాసన వ్యవస్థ ఈ చారిత్రాత్మక సభలో ఉంది’ అని అమిత్ షా అన్నారు. దేశ సుదీర్ఘ చరిత్రలో అసెంబ్లీలు తమ గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా, మనం భయంకరమైన పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చిందని పేర్కొన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ఈ స్పీకర్ల సమావేశం ఉత్తమ పద్ధతులను నేర్చుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు, అసెంబ్లీలు కేంద్ర బిందువులని, రెండూ సరిగ్గా పనిచేయకపోతే, ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు తలెత్తుతాయని ఆయన అన్నారు. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు సజావుగా పనిచేయడం చాలా ముఖ్యమైనదని నొక్కి చెప్పారు. వ్యతిరేకత, అడ్డంకి మధ్య వ్యత్యాసం ఉందని, ప్రతిపక్షం సభ్యుల హక్కు అని, కానీ వారు పనితీరును అంతరాయం కలిగించలేరని అన్నారు. ఎఐ ఆధారిత సాధనాలు వంటి డిజిటల్ ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టాల నిర్మాణంలో పారదర్శకత, సామర్థ్యం బలోపేతం చేయడం ఈ సమావేశం లక్ష్యమని అన్నారు. శాసనసభల పనితీరు కోసం కొత్త విధానాలను అన్వేషించడానికి ఒక అర్థవంతమైన వేదికను అందిస్తాయని భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్, అసెంబ్లీ సెక్రెటరీ నర్సింహా చార్యులు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఢిల్లీ ప్రభుత్వ మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా హాజరయ్యారు. అంతకుముందు విఠల్‌భాయ్ పటేల్, పార్లమెంటరీ సంస్థల పరిణామానికి సంబంధించిన అరుదైన ఆర్కైవల్ రికార్డులు, ఛాయాచిత్రాలు, పత్రాలను ప్రదర్శించే ప్రత్యేక ప్రదర్శనను హౌంమంత్రి అమిత్ షా ప్రారంభించారు.

## 2025 ఆగస్టు 25, సోమవారం తెలుగు పంచాంగం




మాసం- పక్షం
భాద్రపద మాసం
శుక్లపక్షం
తిథి
శుక్ల ద్వితీయ: ఆగస్టు 25 ఉద. 02:54 వరకు
శుక్ల తృతీయ: ఆగస్టు 25 ఉద. 02:54 -ఆగస్టు 26 ఉద. 12:47 వరకు
నక్షత్రం
పుబ్బ: ఆగస్టు 25 ఉద. 10:20 వరకు
ఉత్తర: ఆగస్టు 25 ఉద. 10:20 - ఆగస్టు 26 ఉద. 08:51 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:27 - 5:13
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:55 - 12:46
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 7:30 - 9:00
యమగండం: సా. 10:30- 12:00
దుర్ముహూర్తం: ఉద. 12:40 - 1:32 ౚ రా. 10:24 - 11:08
వర్జ్యం: లేదు

# సిపిఎస్ రద్దు కోసం తపస్ నిరసన.. సీఎం దృష్టికి వినతిపత్రం



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలన్న డిమాండ్‌తో తపస్ ఆధ్వర్యంలో జిల్లాలో నిరసన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిరసన తెలిపారు. మండల తహసీల్దారుల ద్వారా, జిల్లా అదనపు పాలనాధికారి లక్ష్మీ కిరణ్ ద్వారా ముఖ్యమంత్రి కి వినతిపత్రాలు పంపించారు. జీవో నం.28ను "చీకటి జీవో"గా అభివర్ణించిన కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు తదితరులు, ఎన్నికల హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని మండలాల్లో తపస్ నేతలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సత్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

భక్తి, ఆధ్యాత్మికతకు ప్రోత్సాహం



**షాద్ నగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వినాయక చవితి సందర్భంగా సత్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఫౌండేషన్ చైర్మన్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ సంప్రదాయంలో వినాయక పూజకు విశిష్ట స్థానం ఉందని, ప్రతి ఇంటిలో మట్టి వినాయకుడిని ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల సమాజంలో ఆధ్యాత్మికత పెంపొందుతుందని తెలిపారు. "విఘ్నాలు తొలగాలని ప్రార్థిద్దాం" అంటూ, వినాయక చవితి ఉత్సవాలను భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వివేకానంద విద్యాసంస్థల విద్యార్థులు, స్థానిక కాలనీవాసులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్, సత్యనారాయణ, కరుణాకర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఎంసాని శ్రీనివాసులు, ప్రకాష్, రవికుమార్, వంశీకృష్ణ, ప్యాట అశోక్, మల్చలం మురళి, గజ్జల ప్రవీణ్, క్యామ్ మహేష్, సుబ్బు, గుడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్ .



**దేవరకొండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు,లోక్‌సభ మాజీ సభ్యుడు, కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణించిన విషయం దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తెలుసుకొని ఆదివారం నాడు హైదరాబాద్ లోని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్ధుం భవన్ వద్ద సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం కలిగిన సురవరం చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేశారని గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశ నుంచే అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని, దేశ రాజకీయాల్లో ముఖ్యంగా వామపక్ష రాజకీయాల్లో వారు క్రియాశీలక పాత్ర పోషించారని, వారి మరణంతో దేశం ఒక గొప్ప ప్రజాస్వామిక వాదిని కోల్పోయిందని పేర్కొన్నారు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎన్నికైన సురవరం ప్రజా సమస్యల విషయంలో నిరంతరం ముందుండి పోరాటం చేశారని అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థించారు. సురవరం కుటుంబ సభ్యులు, అభిమానులకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


# కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డిమరణం నిరుపేదలకు లోటు

-సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళు లర్పించన మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ, ఆగష్టు 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
సీపీఐ నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం నిరుపేదలకు లోటు అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి ఆయన పూల మాల వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు తన చివరి శ్వాస వరకు రాజీపడని నిరాడంబర జీవితం, రాజీపడని సిద్ధాంతంతో పనిచేశారని అన్నారు.ఏఐఎస్ఎఫ్ నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసినా, ఏనాడూ అహంకారం, అహంభావం తన దరిదాపుల్లోకి రానీయలేదు అని ఆయన అన్నారు.సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని ప్రజల కోసం, పేదల అభ్యున్నతి కోసం అంకితం చేశారు.నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా ఆయన అందించిన సేవలు అపారమైనవి అని ఆయన గుర్తు చేశారు.2004 నుంచి 2009 వరకు శాసనసభ్యులు తన తో కలిసి పని చేయడం జరిగింది అని,సహచరుడిగా పనిచేసిన జ్ఞాపకాలను ఇంకా మదిలోనే ఉన్నాయని ఆయన తెలిపారు.విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన నిలువుటద్దం. ఆయన పోరాట స్ఫూర్తి, నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన అన్నారు.ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని ఆయన తెలిపారు.సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ నరేష్ ఏకగ్రీవ ఎన్నిక



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లాలో రజక సంఘానికి చెందిన విద్యార్థులు, మేధావులు, వృత్తిదారులు సమావేశమై కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తకొండ రాజయ్య, జాతీయ కోఆర్డినేటర్ కొల్లూరి మల్లేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాచకొండ నరేష్ జిల్లా అధ్యక్షుడిగా, కొత్తకొండ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా, కొత్తకొండ రాజయ్య గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు రాచకొండ నరేష్ మాట్లాడుతూ ం "రజకుల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి సంఘం నిరంతరం కృషి చేస్తుంది. వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి పాటుపడతాం. ధరల స్థిరీకరణ పట్టికను అద్దరి ఆమోదంతో ప్రకటిస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక రమేష్, వనపర్తి శంకర్, గంగిపల్లి వెంకటేశ్వర్లు, పూసల సంపత్, శివకృష్ణ, పొన్నాల సంపత్, పంతంగి రవి తదితర మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవం

**ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):క్రోసూరు.**
పెదకూరపాడు నియోజకవర్గం, క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్,డైరెక్టర్ ల ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్,సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ.ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్ షేక్ జరీనా జానీ కి శుభాకాంక్షలు తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**వరంగల్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు 59వ డివిజన్‌లోని స్నేహనగర్, ఇందిరానగర్, భవానినగర్, ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గ కాలనీ, కే యూ ఎంప్లాయిస్ కాలనీల్లో ఒక్కో కాలనీకి 100 మట్టి విగ్రహాలు పంపిణీ చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేతిడి దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పూరెల్ల రవి కిరణ్, దొంగర శ్రీనివాస్, తేళ్ల సుగుణ కిషోర్, టి జనార్దన్ రెడ్డి, బాలు నాయక్, పేరాల శ్రీనివాసరావు, బెడద అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడే వినాయక ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని నేతలు ఆకాంక్షించారు.


## అసువులు బాసిన అరుణతారకు అశ్రు నివాళులు



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సీపీఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. మక్దూం భవన్‌లో మృతదేహానికి పూలమాల వేసి, సుదాకర్ రెడ్డి ప్రజా ఉద్యమాల్లో చేసిన సేవలను గుర్తు చేశారు. వామపక్ష ఉద్యమానికి వన్నె తెచ్చిన మహోన్నత నేత మృతికి సీపీఐ శ్రేణులు తీరని లోటుగా భావిస్తున్నాయి.

# సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో నియామకాలు

కొల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గా బోయ మహేష్.



**అచ్చంపేట, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సమాచార హక్కు చట్టం-2005 ఆధ్వర్యంలో ఆదివారం నాడు అచ్చంపేట పట్టణంలో నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గా బోయ మహేష్ ను నియామిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం పట్ల అవగాహన ఉండాలని, ఈ చట్టం ప్రజల కోసం రూపొందించడం జరిగింది అని ఆయనతెలిపారు.మండలాలలో ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని , ప్రభుత్వ కార్యాలయాలు అధికారులు బాధ్యతలు చేపట్టినప్పుడు వారి పేర్లను నమోదు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. గ్రామస్థాయి సెక్రెటరీ నుండి రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పించి బాధ్యతాయుతంగా సమాచారం కోరితే సమాచారం ఇవ్వవలసిందిగా చట్ట ప్రకారం కోరిన వారికి తప్పక సమాచారం ఇచ్చే విధంగా అధికారులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. వారితోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అజీమ్, రాష్ట్ర కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి కోశాధికారి ఆనంద్, కార్యవర్గ సభ్యులు మొయినుద్దీన్, ప్రకాశ్ లు ఉన్నారు.

# సుల్తానాపూర్‌లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**150 మందికి సేవలు**



**ఎలిగేడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డార్వి ఫౌండేషన్ సౌజన్యంతో, దీపిక హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం సుల్తానాపూర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం ఆనందకరమని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాలని భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు అభిప్రాయపడ్డారు. ఆయనకు సంస్థ తరఫున సన్మానం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, సుల్తానాపూర్ మాజీ సర్పంచ్ అర్సనపల్లి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు, భరోసా సంస్థ సభ్యులు మల్యాల వేణుగోపాల్, తాటిపల్లి సాయితేజ, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియలకు ప్రముఖుల నివాళులు





**వనపర్తి,ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హైదరాబాద్, హిమాయత్‌నగర్ లో సీనియర్ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక దేహానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.
మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
**మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి**
వీరిద్దరూ వేరువేరుగా హాజరై సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి పుష్పాంజలులు ఘటించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ విద్యార్థి సంఘ నాయకులు, కార్యకర్తలు కూడా వారు వెంట ఉండి, నివాళులు అర్పించారు. సుధాకర్ రెడ్డి సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# అడ్మిషన్లకు దరఖాస్తు గడువు పొడిగింపు



**నల్లగొండ ,ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఆగస్ట్ 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ డా.రాజారం తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజులు చెల్లించటానికి అదే చివరి తేదీ అని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 8919436579, 7382929758 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# ఆత్మహత్యాయత్నం నుంచి వ్యక్తిని కాపాడిన లేక్ పోలీసులు



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లోయర్ మానేరు డ్యామ్ వద్ద ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని హోంగార్డు శ్రీనివాస్ సమయస్ఫూర్తితో రక్షించి ప్రాణాలు కాపాడారు. సిద్దిపేటకు చెందిన వేల్పుల సంపత్ కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై డ్యామ్ వద్దకు వచ్చినట్లు తెలుస్తోంది. అతన్ని కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీనివాస్ ధైర్యసాహసాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రశంసించారు.

# సురవరం కు కన్నీటి వీడ్కోలుకు కదలిన సిపిఐ నేతలు



**వనపర్తి ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిపిఐ అగ్రనేత మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు ఈరోజు హైదరాబాదులో జరగనున్నాయి. ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు వనపర్తి పానగల్ మండలాల ముఖ్య నేతలు హైదరాబాద్ తరలి వెళ్లారు. వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌక్ లో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే శ్రీ రామ్, వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. సిపిఐ దిగ్గజనేత సుధాకర్ రెడ్డి మరణంతోదేశంలోని వామపక్ష పోరాటాలకు నష్టమన్నారు. కర్నూలు పాఠశాల విద్యాభ్యాసం నుంచి 15 ఏళ్ల వయసులో పోరాటం ప్రారంభించి జీవిత చరమాంకం వరకు కొనసాగించారన్నారు. 84 ఏళ్ల వయసు అనారోగ్య స్థితిలోనూ ఎర్రచొక్క ధరించి కమ్యూనిస్టు పార్టీ సభలకు హాజరై సందేశం ఇవ్వడం పార్టీ పట్ల ఆయన నిబద్ధతను అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. దేశంలో కమ్యూనిస్టుల చీలిక వల్ల ప్రజా వ్యతిరేక మతతత్వ శక్తులు బలపడి పేద వర్గాలకు తీవ్ర నష్టం కలిగించిందనే భావనతో ఐక్యత కోసం తపించారన్నారు. సమ సమాజ స్థాపన, కమ్యూనిస్టుల ఐక్యత ఆయన ఆశయమని సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయటమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి కాగలదన్నారు. ఆయన మరణం దేశంలోని పాలు ప్రధాన పార్టీల నేతలతో పాటు సామాన్య కార్యకర్త ప్రజలను సైతం కదిలించిందన్నారు. ఫలితంగా జిల్లాలో పార్టీ ఉన్న ప్రతి గ్రామంలో, లేని గ్రామాల్లోనూ శనివారం నివాళు లు అర్పించారన్నారు. ప్రజలకు కార్యకర్తలకు ఆయన పట్ల గల ప్రేమకు అభిమానానికి నిదర్శనం అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య వనపర్తి జిల్లా గౌరవాధ్యక్షులు మాజీ సర్పంచ్ కళావతమ్మ, జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, మాజీ ఉప సర్పంచ్ కాకం బాలస్వామి పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ,సిపిఐ పాన్గల్ మండల కార్యదర్శి డంగు కురుమయ్య కేతేపల్లి గ్రామ శాఖ కార్యదర్శి చిన్న నారాయణ, తెల్లరాల్లపల్లి గ్రామ శాఖ కార్యదర్శి సహదేవుడు, మాజీ వార్డ్ సభ్యుడు లక్ష్మీనారాయణ, కాకం రాముడు, కురువ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలి

-మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి
-భీమగాని గణేష్ సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్



**తిప్పర్తి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు తిప్పర్తి మండల మహాసభ స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గణేష్ పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని పెండింగ్ లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వాలని కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలను ఇవ్వాలని వేతనాలకు సపరేట్ గ్రాంట్ ఏర్పాటు చేయాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు సమస్యలు పరిష్కరించుకుంటే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె సందర్భంగా సమ్మె శిబిరాల దగ్గరికి కాంగ్రెస్ నాయకులు వచ్చి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కనీస వేతన అమలు చేస్తామని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న ఆమెని హామీ అమలు చేయడం లేదని అన్నారు కార్మికుల చిన్న చూపు చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని వారికి ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని పి.ఏప్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు మహాసభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు గ్రామ పంచాయతీ వర్కర్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా కంచర్ల జానయ్య పాలడుగు చంద్రయ్య కోశాధికారిగా పత్తిపురం సైదులు ఉపాధ్యక్షులు విశ్వనాథుల శ్రీనివాస్ చారి చిట్టిమళ్ళ బిక్షం సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి సామేలు నూకల శివ కమిటీ సభ్యులు కిన్నర వెంకటమ్మ బుజ్జమ్మ కల్పన అర్జయ్య అంజయ్య ఇమామ్ లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో మన్నెం మల్లయ్య, యాదయ్య, నరసింహ, అంజయ్య, లచ్చయ్య పరమేష్ ,సత్తయ్య ,గదాసాబ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వచర్లలో సత్యసాయి గ్రామోత్సవం ఘనంగా



**కల్వచర్ల, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా 8వ కాలనీ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో గ్రామోత్సవం భక్తి, సేవా భావంతో వైభవంగా జరిగింది. నామసంకీర్తన, పల్లకీ సేవ, హోమాలు, మాతృపూజ, వేద పారాయణం, అవగాహన కార్యక్రమాలతో గ్రామమంతా ఆధ్యాత్మికతలో నిండిపోయింది. సేవకుల సత్కారంతో పాటు చిన్నారులకు బహుమతులు, పారిశుధ్య కార్మికులకు రక్షణ సాధనాలు అందజేశారు. "లవ్ ఆల్ సర్వ్ ఆల్" నినాదంతో గ్రామ సేవే ముక్తికి మార్గమని నిర్వాహకులు సందేశం ఇచ్చారు.

# సికిందర్ భక్త్ జయంతి వేడుకలు ఘనంగా



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, కేంద్ర మంత్రి, పద్మ విభూషణ్ సికిందర్ భక్త్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సికిందర్ భక్త్ నిజాయితీ, సూత్రనిష్ఠ, ముస్లిం సమాజాన్ని జాతీయ స్రవంతిలోకి తీసుకురావడంలో చేసిన కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**కళాశాల ప్రిన్సిపాల్: ఏ అపర్ణ**



**తిప్పర్తి, ఆగస్టు 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిప్పర్తి మండల కేంద్రం లో గల మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 6వ తరగతి కుండి 10వ తరగతి వరకు అదేవిధంగా ఇంటర్మీడియట్ లో మిగిలిన సీట్ల కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అపర్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. స్పాట్ అడ్మిషన్లు ఆగస్టు 25తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని సీటు కావలసిన విద్యార్థులు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసి, స్టడీ సర్టిఫికెట్స్ తో హాజరు కాగలరని ఒక ప్రకటనలో తెలియజేశారు.



పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్వాగతం పలికిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

# చదరంగం పోటీలకు విశేష స్పందన

## ప్రతిభను మెచ్చిన నిర్వాహకులు




**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జగన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీలకు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 100 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలో మొదటి బహుమతిని మర్రి మహేందర్, రెండవ స్థానాన్ని తురక రాజు, మూడవ స్థానాన్ని చుట్టుమల్ల కశ్యప్ గెలుచుకున్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, జగన్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కేశెట్టి జగన్, టోర్నీ ఆర్గనైజర్ అమీర్ శెట్టి, చీఫ్ ఆర్బిటర్ కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చదరంగం వంటి మేధస్సు క్రీడలకు యువతలో ఆసక్తి పెరుగుతుండటం హర్షకరం అని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

# ముధోల్‌లో ఘనంగా మహారాజ్ పాపన్న గౌడ్ 375వ జయంతి



**ముధోల్, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375వ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ తొలి స్వయం పరిపాలకుడిగా చరిత్రలో నిలిచిన పాపన్న గారి సేవలను స్మరించుకుంటూ, వివిధ వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు, సంఘ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముధోల్ ఎమ్మెల్యే శ్రీ రామారావు పటేల్ మాట్లాడుతూ, “350 సంవత్సరాల క్రితం అప్పటి రాజ్యాల అరాచక పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాలను ఏకం చేసి పోరాడిన మహానాయకుడు పాపన్న గౌడ్. ఆయన శివాజీ సమకాలికుడిగా, తెలంగాణ ప్రజలకు ఐక్యతకు ప్రతీకగా నిలిచారు” అని పేర్కొన్నారు. తెలంగాణ గౌడ్ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముష్కమ్ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, పాపన్న గారి ఆదర్శాలను అనుసరించి ఐక్యతతో రాజ్యాధికారం సాధించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గౌడ్ సంఘం సీనియర్ నాయకులు నర్సగౌడ్ గారు పాపన్న గారి బాల్యం నుండి ఆత్మార్పణ వరకు జరిగిన సంఘటనలను కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుదగోని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ గౌడ్, ముధోల్ గ్రామ గౌడ్ సంఘ సభ్యులు, మాజీ సర్పంచులు అనిల్, రాజేందర్, సత్య గౌడ్, పోతున్న యాదవ్, సుంకెట పోశెట్టి, రమేష్ భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములపై ప్రభుత్వం స్పందించాలి

## ఉప్పరి శ్రీనివాస్



**హైదరాబాద్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ అసైన్డ్ భూమి సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత 20 నెలలుగా ప్రభుత్వం అసైన్డ్ భూములపై స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ల్యాండ్ పుల్లింగ్ పేరుతో పేద రైతుల భూములు లాక్కోవడం, నష్టపరిహారం లేకుండా నీటి ప్రాజెక్టులకు భూములు తీసుకోవడం, పోట్ యాక్ట్ 1977 చట్టం ద్వారా భూ హక్కులు నిరాకరించడం వంటి అంశాలపై శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని, పట్టా పాస్‌బుక్కులు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గ్యార గోవర్ధన్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శ్రీనివాస్, డి. సుదర్శన్ బాబు, కృష్ణవేణి స్టాలిన్, డి. శంకర్, బింగి రాములు, గుంటి విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల నుంచి పెద్ద ఎత్తున పాల్గొనడం ద్వారా అసైన్డ్ భూముల సమస్య తీవ్రతను ప్రభుత్వం గ్రహించాలని నేతలు కోరారు.

# దేవాదాయ కమిటీ అధ్యక్షునిగా మల్లికార్జున్ ఎన్నిక



**మహేశ్వరం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్పేట్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ దేవాదాయ కమిటీకి కరన్ కోట్ మల్లికార్జున్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీ వీరాంజనేయ స్వామి వారి సన్నిధిలో గ్రామ పెద్దల సమక్షంలో ఈ ఎన్నిక జరగగా, ప్రధాన కార్యదర్శిగా ఆవుల అశోక్, కోశాధికారిగా బస్వ యాదయ్య గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మాజీ వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేవాలయ సేవ చేసే అదృష్టం కలిగినందుకు మల్లికార్జున్ గ్రామ ప్రజలకు, యువతకు, పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

# బాలాపూర్ వినాయక దర్శనానికి మంత్రులకు ఆహ్వానం





**రంగారెడ్డి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ నేతలు పాల్గొన్న కార్యక్రమం ఘనంగా జరిగింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ , బాలాపూర్ వినాయకుడి దర్శనానికి బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క (అనసూయ) విచ్చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, ఎక్కే శ్రీనివాస్, నీరుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. వినాయక నవరాత్రుల నేపథ్యంలో బాలాపూర్ గణేశ్ ఉత్సవాలకు విశేష ప్రాధాన్యం ఉండటంతో, మంత్రుల ఆహ్వానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది .

# ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్‌లో కళల కమ్మిన సంబరం



**నాగర్ కర్నూల్, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్‌లోని లహరి ఫంక్షనల్ హాల్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. జానపద కళల వైభవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలో స్థానిక కళాకారులు, సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కళల పట్ల తమ అభిమానం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము , జానపద కళల ప్రాధాన్యతను వివరించారు. “జానపద కళలు ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే అద్దంలాంటివి. గ్రామీణ సంస్కృతిని, సంప్రదాయాలను తరతరాలకు అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి” అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యక్షగానం, ఒగ్గుడోలు, కోలాటం, బంజారా నృత్యాలు వంటి జానపద కళారూపాలు ప్రదర్శించబడి, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కళాకారుల ప్రతిభకు హర్షధ్వానాలు వెల్లువెత్తాయి.

# కల్ములోనిపల్లి గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ



**అమ్రాబాద్, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని కల్ములోనిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, అచ్చంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భాగంగా కల్ములోనిపల్లి సహా తుర్కపల్లి, జంగం రెడ్డిపల్లి, మాధవన్ పల్లి, మొలకమామిడి గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలకు భూమి పూజలు నిర్వహించారని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ప్రతి భవనానికి రూ. 20 లక్షల నిధులు కేటాయించబడినట్లు ఆయన వివరించారు. తుర్కపల్లిలో నూతన భవనానికి శిలాఫలక ఆవిష్కరణ కూడా ఈ సందర్భంగా జరిగింది. కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, “ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్, సన్న బియ్యం, రైతులకు రుణమాఫీ వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తోంది” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ఈ భవనాలు కేంద్రబిందువులుగా నిలవనున్నాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి కి ప్రతిష్టాత్మక జాతీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు...

**హైదరాబాద్, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్యారంగంలో 33 సంవత్సరాలుగా అత్యుత్తమ సేవ చేసిన అంకితభావం కలిగిన విద్యావేత్త, రాష్ట్ర గ్రీన్ అంబాసిడర్, జాతీయ పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి సలహాదారు, (తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల నిర్వహణ సంఘం) సలహాదారు, (నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్) సలహాదారు, “విద్యా రత్న” అవార్డు గ్రహీత, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యుడు మరియు లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్‌పర్సన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డిని ప్రతిష్టాత్మక జాతీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు తో గౌరవించడం జరిగింది. ఈ గౌరవకరమైన సందర్భంగా ట్రస్మా మరియు ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆయోజనలో హైదరాబాద్లోని జన్వాడా నియో కాన్వేషన్ హాల్లో అత్యంత భవ్యంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఏక్ ఉపదేశ్ మీడియా డైరెక్టర్ కులదీప్ సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ కుల్వంత్ సింగ్, ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధు సూధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న. రమేష్ కుమార్, కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు లక్ష్మణ్ గార్లు పాల్గొని డాక్టర్ గోపాల్ రెడ్డి కి ఈ అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ గోపాల్ రెడ్డి 33 సంవత్సరాల క్రితం లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ను స్థాపించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే వారి ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆయన అనేక నూతన పద్ధతులు



అవలంబించారు. పదాలను సులభంగా చదవడం, అర్థం చేసుకోవడం, హ్యాండ్ రైటింగ్ అభివృద్ధి చేయడం, కంప్రిహెన్షన్ స్కిల్స్, జనరల్ నాలెడ్జ్, మ్యాథమెటిక్స్ లో టెక్నిక్స్ వంటి అంశాలపై రీసెర్చ్ చేసి విద్యార్థులకు చక్కని విద్యను అందిస్తున్నారు. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ నుండి విద్యాభ్యాసం చేసిన వేలాది మంది విద్యార్థులు ఈరోజు దేశంలోని వివిధ రంగాలలో డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, టీచర్లుగా అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. ఇది ఈ స్కూల్ యొక్క నాణ్యమైన విద్యకు మరియు విద్యార్థుల అంకితభావానికి నిదర్శనం. ఈ అవార్డును అందుకున్న సందర్భంగా డాక్టర్ గోపాల్ రెడ్డి గారు, “ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను పెంచింది. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఈ విజయానికి సహకరించిన నా ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు” అని తెలిపారు. డాక్టర్ గోపాల్ రెడ్డి ఈ గొప్ప గౌరవానికి మొత్తం లోటస్ ల్యాప్ కుటుంబం వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తుంది. సాధికారత మరియు విద్యను అందించాలనే ఆయన లక్ష్యంలో ఆయన మరింత విజయం సాధించాలని కోరుకుంటున్నాము.

## కార్టూనిస్టు శంకు మృతి పట్ల మేజిక్ రాజా సంతాపం



**కమాన్‌పూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రముఖ కార్టూనిస్టు శంకు ఆకస్మిక మృతి పట్ల కళాకారుడు మేజిక్ రాజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, చిత్రకారుడు, రచయిత, దర్శకుడిగా కళా రంగానికి అపూర్వ సేవలందించారని గుర్తు చేశారు. "తెలుగు వెలుగులు", "అమరావతి కథలు", "సలీం కథలు" వంటి డాక్యుమెంటరీలతో 6 నంది అవార్డులు అందుకున్న శంకు మృతి కళా, సాహితీ రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## రహేజా విస్ట అపార్ట్మెంట్స్ సమస్యలపై స్పందించిన ఎంపీ ఈటల



**నాచారం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇండస్ట్రియల్ ఏరియాలోని రహేజా విస్ట అపార్ట్మెంట్స్‌ను సందర్శించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నివాసితులతో సమావేశమయ్యారు. జిహెచ్ఎంసి పరిధిలోకి అపార్ట్మెంట్‌ను చేర్చాలని, మంచినీటి సమస్య పరిష్కరించాలని వాసులు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఈటల, "ఎన్నికల సమయంలో స్వయంగా రాకపోయినా, 10 లక్షల ఓట్లలో 4 లక్షల మెజారిటీతో గెలిపించారన్నది నాకు గౌరవం" అని పేర్కొన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం మినీ ఇండియా లాంటిదని, దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని తెలిపారు. '70 లక్షల జనాభా ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రతి రోజు ప్రజల మధ్య తిరుగుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను" అని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## బెల్లంపల్లిలో కాంటా కూడలి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**బెల్లంపల్లి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, టియుఎఫ్ఐడిసి నిధులతో కోటి రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రవాణా సౌకర్యాలు మెరుగవుతూ ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వేములవాడ అభివృద్ధికి తొలి అడుగు!



**వేములవాడ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు 80 ఫీట్ల వెడల్పుతో రూ. 6.5 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఇతర అధికారులు పాల్గొన్నారు. 54 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణకు నేడు మోక్షం లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 150 కోట్లు కేటాయించి, ఆలయ అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రైనేజీ, లైటింగ్, అన్నదాన సత్రం, నమూనా పనులు ప్రారంభ దశలో ఉన్నాయని వివరించారు. వేములవాడను టెంపుల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన భోజనం, విద్యా సౌకర్యాలు అవసరం: ఎమ్మెల్యే జీఎస్సార్



**గణపురం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గణపురం మండలంలోని మోడల్ స్కూల్, కళాశాల, బీసీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వంటగదిలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. బగారా రైస్‌లో పదార్థాలు తక్కువగా ఉండటంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ఆర్వో వాటర్ ప్లాంట్, ఫ్లోరింగ్ మరమ్మతులు, కస్తూర్బా గాంధీ భవనం నిర్మాణం వంటి అంశాలపై అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్స్ట్ బుక్స్, ఆల్ ఇన్ వన్ పుస్తకాల కొరతపై స్పందించి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ను కూడా ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే, మాత -శిశు సంరక్షణ, సాధారణ ప్రసవాలపై అవగాహన పెంచాలని వైద్యాధికారిణికి సూచించారు. పెండింగ్ పనులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని సూచించారు. "విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే నాణ్యమైన విద్య, ఆహారం, ఆరోగ్య సేవలు అవసరం. ప్రజా ప్రభుత్వం అందుకు కృషి చేస్తోంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.




## వాసవి క్లబ్ గవర్నర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్ అధికారిక పర్యటన సందర్భంగా, స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ క్లబ్బుల తరపున ఆయనకు ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షులు జిల్లా జగదీష్, ప్రధాన కార్యదర్శి సుద్దాల వెంకటేష్, కోశాధికారి బండ అజయ్ రామ్, జోన్ చైర్ పర్సన్ బొడ్ల శ్రవణ్ కుమార్, రీజియన్ చైర్ పర్సన్ పాత రాధా కిషన్, వైస్ గవర్నర్ ఎల్లంకి ప్రదీప్, అవేర్నెస్ చైర్మన్ అక్కినపల్లి నాగరాజ్, క్యాబినెట్ సెక్రటరీ జైన అర్చన తదితరులు పాల్గొన్నారు. వాసవి సేవా భావాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమం సౌహార్దపూర్వకంగా సాగింది.

## పిఎసిఎస్ డైరెక్టర్ ఇంట్లో యూరియా బస్తాల కలకలం

**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామంలో పిఎసిఎస్ డైరెక్టర్ దొంతరబోయిన యాదగిరి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 26 యూరియా బస్తాలను వ్యవసాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ అక్రమ నిల్వ కలకలం రేపింది. ఈ ఘటనపై సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేసిన అధికారులు, తదుపరి విచారణ చేపట్టారు. వ్యవసాయ అధికారి వీరభద్రం స్పందిస్తూ, "తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

## జనహిత పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు



**గంగాధర, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి జనహిత పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఉప్పరమల్యాల నుంచి కోరిక్యల, మధుర నగర్ రోడ్ వరకు పాదయాత్ర జరగబోయే మార్గాన్ని స్వయంగా సందర్శించి, స్థానిక నాయకులతో ఏర్పాట్లను సమీక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఈ పాదయాత్ర లక్ష్యమని రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని పిలుపునిచ్చారు.

## పోషమల్లు నేత్రాలు సజీవం



**కమాన్‌పూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా బోడగుట్టపల్లి, కన్నాలకి చెందిన నేత్రదాత కీ.శే. భూతగడ్డల పోషమల్లు సంస్మరణ సభను కుటుంబ సభ్యులు స్వగృహంలో నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన పోషమల్లు సేవలను గుర్తించి, కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ భీష్మాచారి, పృథ్వీరాజ్, దేవి లక్ష్మీ నర్సయ్య తదితరులు నేత్ర, అవయవ దానాలపై అవగాహన కల్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, లింగమూర్తి, రామకృష్ణారెడ్డి, ఇతర ప్రతినిధులు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. "నేత్రదానం ద్వారా వెలుగులు పంచిన పోషమల్లు సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే మంజూరు చేయాలి: తుర్పాటి రాజు



**హుజురాబాద్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజురాబాద్ పట్టణ శాఖ బీజేపీ అధ్యక్షుడు తుర్పాటి రాజు ఆధ్వర్యంలో ఆదివారం పాత శిశుమందిర్‌లో సీనియర్ నాయకుల సమావేశం జరిగింది. గణేష్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేద ప్రజలకు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఇండ్లు నిరుపయోగంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రమేయం లేకుండా, అధికారుల పర్యవేక్షణలో అర్హులైన నిరుపేదలకు ఇండ్లు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని విమర్శించారు. ఇండ్ల పంపిణీ ఆలస్యం కొనసాగితే పేదల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రావుల వేణు, తూముల శ్రీనివాస్, నల్ల సుమన్, సబ్బని రమేష్, యాంసాని శశిధర్, నరాల రాజశేఖర్, గంట సంపత్, బోరగాల సారయ్య, కోలిపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### ఆర్యవైశ్య సంఘం సేవా కార్యక్రమం



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మారుతి నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు యాంసాని అశోక్, ప్రధాన కార్యదర్శి ఏలూగూరి మధు, కోశాధికారి మోటూరి అంజనేయులు, సభ్యులు నాళ్ల నవీన్, రేణికుంట ప్రవీణ్, వెలిచాలా చంద్రమోహన్, యాంసాని రవిందర్, యాద శ్రీనివాస్, ఉత్తూరి విఠల్, మాడిశెట్టి మనోహర్, తణుకు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. వినాయక ఉత్సవాలను పర్యావరణ అనుకూలంగా జరుపుకోవాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు చేరవేశారు.

# ఘనంగా పహేల ప్రకాష్ పురబ్ మహోత్సవం



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గోబింద్ నగర్ గురుద్వారాలో పహేల ప్రకాష్ పురబ్ గురుగ్రంధ్ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురుద్వారా అసోసియేషన్ అధ్యక్షులు సర్దార్ హర్మీందర్ సింగ్, కార్యదర్శి రష్పాల్ సింగ్ ఆహ్వానంతో టిఎన్జీవోల సంఘం నాయకులు పాల్గొని గురువచనాలు ఆలకించారు. సిక్కు మత పెద్దలు ప్రత్యేక ఆశీర్వాదాలు అందిస్తూ ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో దారం శ్రీనివాసరెడ్డి, మడిపేల్లి కాళిచరణ్ గౌడ్, కిరణ్ కుమార్ రెడ్డి, గూడ ప్రభాకర్ రెడ్డి, మారుపాక రాజేష్, మంజీత్ సింగ్, బల్బీర్ సింగ్, బచ్చన్ సింగ్, జగన్ గౌడ్, ఎమ్.ఎన్. స్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ బోనాల ముగింపుతో పోచమ్మ తల్లి దర్శించిన ఎమ్మెల్యే నాయిని



**బాలసముద్రం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే శ్రావణ మాస బోనాలు ముగింపు సందర్భంగా, బాలసముద్రంలోని పోచమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం భక్తులకు అన్నదానం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లెపు రమేష్, బొంత సుజాత సారంగం, రావుల కోమల, పల్లపు రాజు, రమేష్ తదితర స్థానిక నాయకులు పాల్గొని, ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికారు. భక్తి, భోజనం, భద్రతతో సాగిన ఈ వేడుకకు ప్రజలు విశేషంగా హాజరయ్యారు.

# వ్యాపార నష్టంతో బాధపడి వ్యక్తి ఆత్మహత్య



**దేవరకొండ, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్గొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో ఆదివారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాయిని భాస్కర్ (55) అనే వ్యక్తి తన ఫెర్టిలైజర్, కిరాణా షాప్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత రెండు సంవత్సరాలుగా వ్యాపారంలో తీవ్ర నష్టాలు ఎదురవుతూ, ఆర్థిక ఒత్తిడితో మానసికంగా కుంగిపోయిన భాస్కర్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటల సమయంలో షాప్ సీలింగ్‌కు ఉన్న కొండికి నైలాన్ తాడుతో ఉరివేసుకున్న భాస్కర్‌ను కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరకొండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. భాస్కర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆర్థిక సమస్యలు వ్యక్తిగత జీవితంపై ఎంతటి ప్రభావం చూపగలవో ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. గ్రామస్థులు భాస్కర్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# లోక్ అదాలత్‌కు ముందస్తు సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్




**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎస్. శివకుమార్తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సెప్టెంబర్ 13న జరగనున్న లోక్ అదాలత్లో పెండింగ్ రాజీ కేసులను కోర్టుల వారీగా పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలు, సైబర్ నేరాల్లో నిలిపివేసిన మొత్తాల రిఫండ్, సీసీ నంబర్ల కేటాయింపు, వర్చ్యువల్ సాక్ష్యాల ప్రవేశంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ శ్రీనివాస్ జి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లిని పరామర్శించిన కాంగ్రెస్ అగ్రనేతలు



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఆయనను పరామర్శించారు. కరీంనగర్ వాల్మీకి నగర్‌లోని నివాసానికి చేరుకుని రాజేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పరామర్శకు వచ్చినవారిలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మెన్నేని రోహిత్ రావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, బొంతు రామ్మోహన్, శంకర్ నాయక్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సత్తు మల్లేశం, కొండూరి రవీందర్ రావు కూడా పరామర్శించారు.

# సచ్చిదానంద ఆశ్రమం రామాలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకోవాలని వినతి



**కొత్తపల్లి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మున్సిపాలిటీలోని శ్రీ సచ్చిదానంద ఆశ్రమం రామాలయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోకి తీసుకొని అభివృద్ధి చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించింది. సర్వే నెంబర్ 278/5లోని ఆలయానికి చెందిన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ విద్యాసంస్థలకు 99 సంవత్సరాల లీజుకు ఇచ్చిన ఘటనపై ఆందోళన వ్యక్తమైంది. దేవాలయ భూములు అన్యక్రాంతమవుతున్నాయని, కబ్జాదారుల నుంచి రక్షించాల్సిన అవసరం ఉందని సంఘం నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవ్వంపల్లి అజయ్, రాయి కంటి శ్రీనివాస్, వడ్ల రాజు, ఎన్. సత్యనారాయణ చారి, గజ్జల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ కీలక హెచ్చరిక చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ర్యాగింగ్‌ను తీవ్రమైన నేరంగా పేర్కొంటూ, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే చర్యగా అభివర్ణించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లపై చేసే వేధింపులు, అసభ్యకర ప్రవర్తన చట్టపరంగా శిక్షార్హమని స్పష్టం చేసిన కమిషనర్, అటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులను విద్యాసంస్థల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ చర్యలు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆయన పేర్కొన్నారు. ర్యాగింగ్ నియంత్రణకు ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించిన గౌష్ ఆలం, యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని, కొత్త విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అలాగే, అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు, విద్యార్థుల ఫిర్యాదుల కోసం 24 గంటల హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు సహ విద్యార్థుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఎటువంటి వేధింపులకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేసిన కమిషనర్, ర్యాగింగ్‌కు గురైన వారు తక్షణమే ప్రిన్సిపాల్ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ర్యాగింగ్ సమాచారం కోసం డయల్ 100 లేదా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 8712670744, 8712670745కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ర్యాగింగ్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరమని, విద్యాసంస్థలు భద్రతా వాతావరణాన్ని కల్పించేందుకు ముందుండాలని కమిషనర్ గౌష్ ఆలం ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# భూపాలపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ ఫుడ్ పాయిజన్ ఘటనపై కఠిన చర్యలు



**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. వాటర్ ట్యాంక్‌లో పురుగుల మందు కలిపిన సైన్స్ టీచర్ రాజేందర్పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులను బెదిరించినట్లు గుర్తించిన టీచర్లు సూర్య కిరణ్, వేణు, అసిస్టెంట్ కుక్ రాజేశ్వర్పై కూడా చర్యలు తీసుకున్నారు. నలుగురిని విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనలో 13 మంది విద్యార్థులు, ఒక టీచర్ అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాగునీటిలో కలుషితతపై అధికారులు విచారణ చేపట్టి, పురుగుల మందు కలిపిన వాస్తవం వెలుగులోకి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

# బుద్దారంలో మోడల్ అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన



**గణపురం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భూపాలపల్లి నియోజకవర్గం బుద్దారం గ్రామంలో జెన్కో సీఎస్ఆర్ నిధులతో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించనున్న మోడల్ అంగన్వాడీ కేంద్ర భవనానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి అధికారులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది శాలువాలు కప్పి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రజా ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగాలి” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్ఐసీ ఏజెంట్ల సమాఖ్య సర్వసభ్య సమావేశం




**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య 1964 బ్రాంచ్ 2 కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం అన్నమనేని గార్డెన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై, ఏజెంట్ల సమస్యలు, అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. ఎల్ఐసీ ఏజెంట్ల హక్కుల పరిరక్షణ, వృత్తి స్థిరీకరణ, భవిష్యత్ సంక్షేమం కోసం సమాఖ్య చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. సమావేశంలో ఏజెంట్లు, సమాఖ్య ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. వృత్తి గౌరవాన్ని పెంపొందించేలా ఎల్ఐసీ సమాఖ్య 1964 చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని నేతలు పేర్కొన్నారు.

# జోష్గా నేషనల్ స్పోర్ట్స్ డే ఉత్సవాలు




**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ డే ఉత్సవాలు ఆగస్టు 23 నుండి 31 వరకు నిర్వహించబడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు డా. బీ.ఆర్. అంబేద్కర్ స్టేడియం నుండి తెలంగాణ చౌక్ వరకు 3 కిలోమీటర్ల రన్ నిర్వహించగా, డీపీవో జగదేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ జనార్ధన్ రెడ్డి, యోగా అసోసియేషన్ సెక్రెటరీ సిద్ధ రెడ్డి, పేట అధ్యక్షులు బాబు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు, అభిమానులు సహా 420 మంది పాల్గొన్నారు.

# బిజినెస్

# ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ తేదీ అదేనా? ఆపిల్ ఆ పోస్ట్‌ను ఎందుకు డిలీట్ చేసింది!



టెక్ దిగ్గజం ఆపిల్ తన కొత్త ఐఫోన్ 17 లైనప్‌ను త్వరలో లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పుడు కంపెనీ చేసిన పొరపాటు కారణంగా ఈ లైనప్ లాంచ్ తేదీ వెల్లడైంది. కంపెనీ ఆపిల్ టీవీ యాప్‌లో ఈవెంట్ ఆహ్వానాన్ని పోస్ట్ చేసింది. కొత్త ఐఫోన్ సిరీస్ లాంచ్ తేదీ వెల్లడించింది. అయితే, తర్వాత కంపెనీ ఈ పోస్ట్‌ను తొలగించింది. కానీ అప్పటికి ఆపిల్ తదుపరి కొత్త ఫోన్‌ను ఏ తేదీన తీసుకురాబోతోందో తెలిసింది. ఆపిల్ ఈవెంట్ ఆహ్వానం ప్రకారం.. కంపెనీ కొత్త లైనప్‌ను సెప్టెంబర్ 9న ప్రారంభిస్తుంది. సాధారణంగా ఆపిల్ ఆగస్టు చివరి నాటికి తన ఈవెంట్‌ను ప్రకటిస్తుంది. అటువంటి పరిస్థితిలో ఈవెంట్ తేదీని వెల్లడించడం కంపెనీ పొరపాటు కావచ్చు లేదా అది బాగా ఆలోచించిన వ్యూహం కూడా కావచ్చు. అయితే లాంచ్ తేదీని కంపెనీ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కంపెనీ 4 కొత్త ఐఫోన్‌లను విడుదల చేస్తుంది. ఆపిల్ ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌లో తన కొత్త ఐఫోన్ సిరీస్‌ను విడుదల చేస్తుంది. టెక్ ప్రపంచం ఈ లాంచ్ ఈవెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటివరకు కంపెనీ అధికారికంగా దాని ఆఫర్ గురించి ఏమీ చెప్పలేదు. కానీ నివేదికలు, లీక్‌ల ప్రకారం ఆపిల్ ఈసారి నాలుగు కొత్త ఐఫోన్‌లను ప్రవేశపెడుతుందని వెల్లడైంది. కొత్త లైనప్‌లో ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మాక్స్ ఉంటాయి. ఐఫోన్‌తో పాటు ఆపిల్ వాచ్. నెక్స్ట్ జనరేషన్ ఎయిర్‌బడ్స్ కూడా ఈ ఈవెంట్‌లో లాంచ్ అవుతాయని భావిస్తున్నారు. ఈసారి ఆపిల్ ఐఫోన్ లైనప్ నుండి ప్లస్ మోడల్‌ను తొలగించి దాని స్థానంలో ఐఫోన్ 17 ఎయిర్‌ను విడుదల చేస్తుంది. ఇది కంపెనీ ఇప్పటివరకు అత్యంత సన్నని ఐఫోన్ అవుతుంది. దీని ధర ప్లస్ మోడల్ కంటే కొంచెం ఎక్కువగా ఉండవచ్చు. దీనిని మార్కెట్లో దాదాపు రూ. 94,900 ధరకు విడుదల చేయవచ్చని అంచనా.

## మొరాయించిన ఎయిర్‌టెల్ సేవలు..

### కంపెనీపై యూజర్ల ఆగ్రహం..!

భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి మొరాయించింది. ఈ సారి బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ సహా పలు కీలక నగరాల్లో ప్రభావం కనిపించింది. ఈ నెల 8న ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాంతో కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. డౌన్‌డెటెక్టర్ నుంచి వచ్చిన డేటా ప్రకారం.. మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో ఫిర్యాదులు వచ్చాయి. 7,100 మందికి పైగా వినియోగదారులు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ ఎయిర్‌టెల్ కేర్స్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. 'తాత్కాలిక కనెక్టివిటీ సమస్య'గా పేర్కొంది. సమస్యను గంటలోగా పరిష్కారమవుతుందని పేర్కొంది. యూజర్లు తమ మొబైల్స్‌ను రీ స్టార్ట్ చేయాలని కంపెనీ సూచించింది. ఎయిర్ ట్వీట్‌లో 'ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండి. ఈ సమస్య తాత్కాలిక కనెక్టివిటీ అంతరాయం కారణంగా జరుగుతుంది. దాదాపు ఒక గంటలో పరిష్కారమవుతుంది. మీ మొబైల్‌ను ఒకసారి రీస్టార్ట్ చేయండి' అని పేర్కొంది. నెట్‌వర్క్‌లో అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ రోజు బెంగళూరులో ఎయిర్‌టెల్ ఇంటర్‌నెట్ నిలిచిపోయింది. కంపెనీ వినియోగదారులకు ముందుగానే తెలియజేయకూడదా?' అంటూ ఓ యూజర్ ప్రశ్నించాడు. మరొక యూజర్ 'గత 6 గంటలుగా ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ సేవలు నిలిచిపోయాయి. కాల్స్ రావడం లేదు. ఇంటర్నెట్ కూడా స్తంభించింది. కస్టమర్ కేర్ నుంచి కూడా స్పందన లేదు. దీనిపై TRAI చర్య తీసుకోవాలి' అంటూ డిమాండ్ చేశాడు.

# స్థిరంగా బంగారం ధరలు.. తులం ఎంత అంటే?




పెళ్లిళ్ల సీజన్, పండుగలు కూడా రానుండటంతో చాలా మంది ఇప్పటి నుంచే తమకు కావాల్సిన బంగారు ఆభరణాలు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. కానీ ఈ మధ్య బంగారం ధరలు అనేవి విపరీతంగా పెరుగుతూ అందరికీ షాకిస్తున్నాయి. అయితే ఆగస్టు 24న బంగారం ధరలు ఎలాంటి మార్పులేదు. గోల్డ్ రేట్స్ నేడు స్థిరంగా ఉన్నాయి. ఆగస్టు 24 ఆదివారం రోజున 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,01,620 గా ఉంది. అదే విధంగా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 93,150 గా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 93,150 వద్ద ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 93,150 వద్ద ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 93,150 వద్ద ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 93,150 వద్ద ఉంది.

మరో వైపు నేడు వెండి ధరలు కూడా స్థిరంగా ఉన్నాయి. మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ. 1,30,000గా ఉంది. ఈరోజు ఆది వారం బంగారం, వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు పుజారా గుడ్‌బై..

### హెడ్‌కోచ్ గంభీర్ సహా ఎవరు ఏమన్నారంటే..?





భారత జట్టు సీనియర్ బ్యాట్స్‌మెన్ ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్‌కు ఆదివారం వీడ్కోలు ప్రకటించాడు. సోషల్ మీడియా వేదికగా క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు వెల్లడించాడు. భారత జెర్సీ ధరించడం, జాతీయ గీతం పాడడం, ప్రతిసారీ మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం తనకు ఎంత ప్రత్యేకమైనదో మాటల్లో చెప్పలేనని.. కానీ ప్రతిదానికి ముగింపు ఉంటుందని.. భారత క్రికెట్ నుండి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో పుజారా కామెంటేటర్‌గా కనిపించిన విషయం తెలిసిందే. ఇక పుజారా చివరిసారిగా జూన్ 2023లో ఇంగ్లండ్‌లోనే చివరి టెస్ట్ ఆడాడు. ఓవల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023 ఫైనల్ మ్యాచ్ ఆఖరిది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారత జట్టును ఓడించింది. పుజారా తన అంతర్జాతీయ కెరీర్‌లో 103 టెస్టులు, ఐదు వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 176 ఇన్నింగ్స్‌లలో 43.61 సగటుతో 7,195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యుత్తమ స్కోరు 206 పరుగులు కాగా.. వన్డేల్లో అతను 39.24 సగటుతో 51 పరుగులు చేశాడు. పుజారా ఐపీఎల్‌లో 30 మ్యాచ్‌లు ఆడాడు. 22 ఇన్నింగ్స్‌లలో అతను 99.75 స్ట్రయిక్ రేట్‌తో 390 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన పుజారాకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. టీమ్ ఇండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ తుఫాను వచ్చినప్పుడు అండగా నిలిచాడని.. ఆశలు సన్నగిన్నలుతున్నప్పుడు పోరాడాడని గంభీర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా బొగ్లే స్పందిస్తూ.. భారత క్రికెట్‌కు పుజారా చిహ్నంగా నిలుస్తాడని పేర్కొన్నారు. అతనో పోరాట యోధుడని.. గౌరవప్రదమైన క్రికెట్ ఆడాడని పేర్కొన్నారు. మైదానంలో ప్రతిసారీ భారత్ కోసం తనవంతు కషి చేశాడని.. భారత అభిమానులు ఈ రోజు ఎక్కడ ఉన్న లేచి నిలబడి చప్పట్లు కొడుతారని పేర్కొన్నారు. మాజీ క్రికెటర్ వసీం జాఫర్ మాట్లాడుతూ భారత క్యాప్ ధరించి సాధించిన దానికి చాలా గర్వపడాలని.. భవిష్యత్ బాగుండాలంటూ శు భాకాంక్షలు తెలిపారు. పుజారా రిటైర్మెంట్‌పై బీసీసీఐ సైతం స్పందించింది. భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడని పేర్కొంది.

# స్పోర్ట్స్

## ఆసియా కప్ ముంగిట గంగూలీకి కీలక బాధ్యతలు..

### దానికి కారణం ఇదే!



టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి ఒక పెద్ద బాధ్యత అప్పగించారు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ SA 20లో ఆడనున్న ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టుకు అతన్ని హెడ్ కోచ్‌గా నియమించారు. ఐపీఎల్ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఈ జట్టు అనుబంధం. ఈ రెండు జట్ల యజమానులు JSW స్పోర్ట్స్, GMR. ప్రపంచంలోని చాలా లీగ్‌ల పేర్లను ఐపీఎల్ ఫ్రాంచైజీల పేర్ల ఆధారంగానే పెట్టారు, ఆయా జట్లను కూడా ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులే కొనుగోలు చేశారు.

**సౌరవ్ గంగూలీ హెడ్ కోచ్‌గా బాధ్యతలు**

ప్రిటోరియా క్యాపిటల్స్ తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో గంగూలీని కొత్త హెడ్ కోచ్‌గా ప్రకటించింది. "ప్రిన్స్ క్యాపిటల్స్ క్యాంప్‌లో రాయల్ స్టైల్‌ను తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాడు" అంటూ పోస్ట్ చేశారు. "సౌరవ్ గంగూలీని మా కొత్త హెడ్ కోచ్‌గా ప్రకటించడం మాకు చాలా సంతోషంగా ఉంది" అని కూడా ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. గంగూలీ గతంలో ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ డైరెక్టర్‌గా పనిచేశారు. అయితే, ఒక జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసారి.

SA20 లీగ్‌లో 13 మంది భారతీయ క్రికెటర్లు

దక్షిణాఫ్రికాలో ఈ టీ20 లీగ్ నాలుగో సీజన్ జరుగుతోంది. ఈ లీగ్ కోసం 13 మంది భారతీయ ఆటగాళ్లు కూడా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన లేదా భారత్, ఐపీఎల్‌కు ఆడటానికి నిరాకరించిన ఆటగాళ్లు మాత్రమే విదేశీ లీగ్‌లలో ఆడటానికి అర్హులు. ఈసారి ఈ లీగ్‌లో పీయూష్ చావ్లా కూడా ఆడతారని సమాచారం. ఈ సీజన్ కోసం ఆటగాళ్ల వేలం సెప్టెంబర్ 9న జరగనుంది. అదే రోజు ఏసియా కప్ కూడా మొదలవుతుంది. గతంలో దినేష్ కార్తిక్ ఈ లీగ్‌లో ఆడిన మొదటి భారతీయ ఆటగాడు.

# శ్రేయస్ అయ్యర్ ఫ్యాన్స్‌కు డబుల్ గూస్‌బంప్స్.. ఆ రూల్‌తో ఆసియా కప్‌లో ఆడొచ్చట



ఆసియా కప్ 2025 కోసం భారత జట్టును ప్రకటించారు. అయితే, ఈ జట్టులో అద్భుతమైన బ్యాట్స్‌మెన్ శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. ఈ నిర్ణయం చూసి చాలామంది అభిమానులు ఆశ్చర్యపోయారు. శ్రేయస్ అయ్యర్‌కు టీమిండియాలో తప్పకుండా చోటు లభిస్తుందని అందరూ భావించారు కానీ అలా జరగలేదు. అయితే, జట్టును ప్రకటించిన తర్వాత కూడా శ్రేయస్ అయ్యర్‌కు స్క్వాడ్‌లో చేరే అవకాశం ఉంది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం.. శ్రేయస్ అయ్యర్‌తో పాటు యశస్వి జైస్వాల్, మహ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లు కూడా జట్టులోకి వచ్చే అవకాశం ఉంది.

**శ్రేయస్ అయ్యర్‌కు ఛాన్స్ ఎలా?**

ఏసీసీ నిబంధనల ప్రకారం, ఒకవేళ ఏదైనా జట్టులోని ఏ ఆటగాడైనా గాయపడితే, లేదా జట్టు మేనేజ్‌మెంట్ మరొక ఆటగాడిని తీసుకోవాలని భావిస్తే, వారి స్థానంలో మరొక ఆటగాడిని తీసుకోవచ్చు. ఈ నియమం ప్రకారం.. స్టాండ్‌బై జాబితాలో ఉన్న ఆటగాళ్లను మాత్రమే తీసుకోవాలని లేదు. స్టాండ్‌బై జాబితాలో లేని ఆటగాళ్లకు కూడా జట్టులో చోటు లభించవచ్చు.

ఈ నిబంధనను బట్టి టోర్నమెంట్‌కు ముందు లేదా ఆసియా కప్ 2025 జరుగుతున్నప్పుడు భారత్ జట్టులోని ఏదైనా ఆటగాడు గాయపడితే, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం దక్కవచ్చు.

**శ్రేయస్ అయ్యర్ టీ20 ప్రదర్శన**

టీ20 క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ ప్రదర్శన ఎప్పుడూ అద్భుతంగా ఉంటుంది. అతను తన బ్యాటింగ్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో కూడా శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని కెప్టెన్సీలో జట్టు 2025 సీజన్ ఫైనల్‌కు చేరుకుంది. బ్యాటింగ్‌లోనూ అయ్యర్ తన సత్తా చూపించాడు. 17 మ్యాచ్‌లలో 50.33 సగటుతో 604 పరుగులు చేశాడు. ఇందులో ఆరు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని హయ్యెస్ట్ స్కోరు 97 నాటౌట్.

టీ20 క్రికెట్‌లో భారతదేశం తరపున అతను ఇప్పటివరకు 51 మ్యాచ్‌లు ఆడి, 30.66 సగటుతో 1104 పరుగులు చేశాడు. ఇందులో ఎనిమిది అర్ధ శతకాలు ఉన్నాయి, అతని అత్యధిక స్కోరు 74 నాటౌట్. ఓవరాల్‌గా 240 టీ20 మ్యాచ్‌లలో అయ్యర్ 34.08 సగటుతో 6578 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 147. ఈ ఫార్మాట్‌లో అతను మూడు సెంచరీలు, 43 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.